జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు టేబుల్స్ విరాళం

రుద్రూర్ (వర్ని), బతుకమ్మ :వర్ని మండలం శ్రీనగర్ గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థుల కొరకు మాదాల చారిటబుల్ ట్రస్ట్ (సీసీడి) ఆధ్వర్యంలో సోమవారం టేబుల్స్ ని విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో సుబ్బారావు, మాదాల చారిటబుల్ ట్రస్ట్ జనరల్ మేనేజర్ తాగూర్, బోధన్ కమ్మ సంఘం అధ్యక్షులు శివన్నారాయణ, జెడ్పి హెచ్ ఎస్ హెచ్ఎం, అశోక్, శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ మద్దిపాటి పూర్ణిమ కిరణ్, ఉప సర్పంచ్ విశ్వనాథం, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖలో ఇద్దరు ఏఏఈలకు పదోన్నతులు

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ :నిజామాబాద్ సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న ఇద్దరు ఏఏఈ లకు ఏడీఈలుగా పదోన్నతులు కల్పిస్తూ ఎన్పీడీసీఎల్ కంపెనీ సీఎండీ వరుణ్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. నిజామాబాద్ డివిజన్ కార్యాలయంలో కమర్షియల్ ఏఏఈగా పనిచేస్తున్న రాజేందర్ రెడ్డి కి ఏడీఈ గా పదోన్నతి కల్పిస్తూ ఖీంగల్ లో ఆపరేషన్ విభాగం లో పోస్టింగ్ ఇవ్వగా, బుధవారం విధులలో చేరనున్నారు. నగరంలోని ఏడవ సెక్షన్ లో ఏఏఈ గా విధులు నిర్వహిస్తున్న జి. బాబా శ్రీనివాస్ కు డివిఈ లో ఏడీఈ గా పోస్టింగ్ ఇచ్చారు. ఉత్తర్వులు వెలువడిన నాడే బాబా శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు.

ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలు నింపే విధంగా అవగాహన కల్పించాలి

తహసీల్దార్ బాలయ్య వెల్లడి

ఇందల్వాయి, బతుకమ్మ :ఇందల్వాయి మండలంలోని వివిధ గ్రామాలలో సోమవారం బీఎల్ఓ లకు ప్రభుత్వ ఆదేశాలను ఇందల్వాయి తహసీల్దార్ బాలయ్య వెల్లడించారు. ఈ మేరకు సోమవారం మండలంలోని నల్లవెల్లి, గౌరారం, కేకే తండా తదితర గ్రామాలను ఆయన సందర్శించారు. అనంతరం ఆయా గ్రామాలలో ప్రజలకు ఎన్యుమరేషన్ ఫారాలు నింపే విధంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. సంబంధిత బి ఎల్ వో లు ఓటర్లు ఫారాలు నింపే విధంగా అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆదేశాలు ప్రజలకు వివరించాలని సూచించారు. ఏ గ్రామంలో కూడా ఒక్క ఓటు తప్పుగా నమోదు చేయవద్దని సూచించారు. ఆయన వెంట కేకే తండా సర్పంచ్, తో పాటు నల్లవెల్లి సర్పంచ్ కన్నె రాజేందర్, గౌరారం సర్పంచ్ హేమలత తదితరులున్నారు.

ఎనిమిదవ రోజు కొనసాగిన నిరసన

మెండోరా, బతుకమ్మ :యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాల్లోని కోల్, యాష్ ప్లాంట్ల నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు టెండర్లు పిలవడాని నిరసిస్తూ పోచంపాడ్ జలవిద్యుత్ కేంద్రంలో ఉద్యోగుల నిరసన 8 వ రోజుకు చేరుకుంది. టి జి పి ఈజేఏసీ నాయకులు కే సతీష్, ఎండి రఫీ, దేవరాజ్, ఎం ప్రవీణ్, చంద్రశేఖర్, రాంబాబు, స్వాతి, దేవి, ఏవి శ్రీనివాస్ తదితరుల నాయకత్వంలో ఉద్యోగులు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెన్ కో ఉద్యోగులకు మద్దతుగా ట్రాన్స్ కో, డిస్కం ఉద్యోగులు కూడా రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. యజమాన్యం టెండర్ ప్రక్రియను వెంటనే వెనక్కి తీసుకోకపోతే మరింత ఉధృతంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జలవిద్యుత్ కేంద్ర ఉద్యోగులు టిజిపి ఈ జే ఏసి నాయకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉపకేంద్రాల్లో కెపాసిటర్ బ్యాంకుల ఏర్పాటు

వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ :జిల్లాలోని 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాల్లో విద్యుత్ సరఫరా నాణ్యతను మెరుగుపరిచేందుకు కెపాసిటర్ బ్యాంకుల ఏర్పాటు చేపడుతున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా ఏఆర్పీ క్యాంప్ 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో కెపాసిటర్ బ్యాంక్‌ను ఏడీఈ (కన్‌స్ట్రక్షన్) తోట రాజశేఖర్ సాంకేతికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కెపాసిటర్ బ్యాంకుల ఏర్పాటు ద్వారా వ్యవసాయదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడంతో పాటు ఓల్టేజ్ పెరుగుతుందని, 33 కేవీ లైన్ నష్టాలు తగ్గుతాయని తెలిపారు. అలాగే పవర్ ట్రాన్స్ ఫార్మర్లపై భారం కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. గౌరవ సీఎండీ ఆదేశాల మేరకు జిల్లాలోని 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాల్లో దశలవారీగా కెపాసిటర్ బ్యాంకుల ఏర్పాటు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. ఈ క్రమంలో కల్లూరు, శ్రీనగర్, ఏఆర్పీ క్యాంప్

విద్యుత్ ఉపకేంద్రాల్లో కూడా కెపాసిటర్ బ్యాంకులను ప్రారంభించారు. ఇప్పటివరకు నిజామాబాద్ జిల్లాలో మొదటి విడతలో 31, రెండో విడతలో 11, మూడో విడతలో 41 కెపాసిటర్ బ్యాంకులను వివిధ విద్యుత్ ఉపకేంద్రాల్లో ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక లైన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, లైన్‌మెన్ సాయిబాబా, సిల్వెల్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రాజెక్ట్ ఇంజనీర్ శ్రీకాంత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వనంలో చెట్లను తొలగిస్తున్నారు

మా దృష్టికి రాలేదు : ఎంపీడీవో అనిత రెడ్డి

మహమ్మద్ నగర్, బతుకమ్మ : కామారెడ్డి జిల్లా మహమ్మద్ నగర్ తహసీల్దార్ కార్యాలయం పక్కన పకృతి వనం ఏర్పాటు చేశారు. ఆ ప్రకృతి వనంలో మొక్కలు వృక్షాలుగా పెరిగి ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణం అందిస్తుంది. స్థలం లేకపోవడంతో పాఠశాల ఆవరణలో ఈ ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేశారు. మొక్కలు పెరిగి వృక్షాలుగా మారిన తర్వాత తహసీల్దార్ కార్యాలయంలోకి విష పురుగులు వస్తున్నాయని, పెరిగిన చెట్లను జెసిబి ద్వారా తొలగిస్తున్నారు. ఎంతో ఖర్చు చేసి ప్రకృతి వనంలో మొక్కలు నాటి వృక్షాలుగా పెంచిన తర్వాత ఆ అధికారి ఆ మొక్కలను జెసిబి ద్వారా తొలగించడం పై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఏమైనా అంటే తమ కార్యాలయం లోకి విషపురుగులు వస్తున్నాయని పెరిగిన చెట్లను తొలగిస్తున్నారు. ఈ విషయంపై ఏపీవో శివకుమార్ దృష్టికి తీసుకెళ్లగా తన దృష్టికి రాలేదని, తాము ప్రకృతి వనాలు, అవెన్యూ

ప్లాంటేషన్ గ్రామపంచాయతీలకే అప్పగించామని వారే వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఎంపీడీవో ఈ విషయాన్ని గ్రామ కార్యదర్శి జ్యోతి దృష్టికి తీసుకువెళ్లగా తహసీల్దార్ లతా, ప్రకృతి వనాల్లో ఉన్న మొక్కలను తమకు సమాచారం ఇవ్వకుండా తొలగిస్తున్నారని ఆమె వెల్లడించారు. పిచ్చి మొక్కలు కాదు ఏకంగా ప్రకృతి వనంలో ఉన్న చెట్లను జెసిబి ద్వారా తొలగిస్తున్న మాట వాస్తవమని ఆమె అంగీకరించారు. విషయంపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి జ్యోతి వెల్లడించారు.
తమకు సమాచారం ఇవ్వకుండా ప్రకృతి వనంలో గాని, అవెన్యూ ప్లాంటేషన్ లో పెంచిన చెట్లను నరికితే అది చట్టరీత్యా నేరమని ఆమె వెల్లడించారు. ఓ తహసీల్దార్ ఉండి తమ కార్యాలయం వద్ద పచ్చని చెట్లతో ఎంతో ఆహ్లాదకరంగా ఉన్న మొక్కలను జెసిబి ద్వారా తొలగించడం ఎంతవరకు సమంజసమని ప్రజల నుంచి ప్రశ్నలు వెల్లబడుతున్నాయి. తహసీల్దార్ కు మొక్కలు నరికే అధికారం ఎవరిచ్చారు అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. మొక్కలు తొలగించడంపై అధికారులపై కలెక్టర్ చర్య తీసుకుంటారో లేదో వేచి చూడాల్సిందే...

16 వ వార్షికోత్సవ యజ్ఞం నిర్వహణ

జై దుర్గా మాత సేవాలాల్ మందిరంలో ప్రత్యేక పూజలు

ఆలయ కమిటీ చైర్మన్ బాధావత్ కిషన్

ఇందల్వాయి, బతుకమ్మ :ఇందల్వాయి మండల కేంద్రంలోని తాండ గ్రామంలో సోమవారం జై దుర్గా మాత సేవాలాల్ మందిరంలో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం పౌర్ణమి ముందర ఆలయంలో బ్రాహ్మణుల మంత్రోచ్ఛారాలతో పూజలు నిర్వహించడం జరుగుతుందని జై దుర్గా మాత సేవాలాల్ ఆలయ కమిటీ చైర్మన్ బాధావత్ కిషన్ తెలిపారు. ఈ పూజలలో జంటల వారీగా ఇందల్వాయి తాండవా గ్రామ వాసులు యజ్ఞాలలో స్వచ్ఛందంగా పాల్గొనడం జరుగుతుందని తెలిపారు. పూజలో హాజరైన భక్తులు జై దుర్గా మాత జై సేవాలాల్ దేవతలకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో పాడిపంటలతో,ఆయురారోగ్యాలతో,సంతోషంగా ఉండాలని కోరినట్లు తెలిపారు. వివరాల్లోకి వెళితే ఆలయ నిర్మాణం 2010లో నిర్మించడం జరిగిందని ఇప్పటివరకు దాదాపు నేటితో 16 సంవత్సరాలు గడుస్తున్నందున భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు భోజనాలు నిర్వహించారు.ఈ

కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాధావత్ కిషన్, ఇందల్వాయి తాండ గ్రామ సర్పంచ్ బాదావత్ సుదర్శన్ నాయక్, ఉప సర్పంచ్ బాలు, మాజీ సర్పంచ్ చందర్ నాయక్, తాండ సదర్ నాయక్ గన్యా నాయక్, ఆలయ పూజారి బాల్య నాయక్, మాజీ డైరెక్టర్ చందర్, నారాయణ, బలిరాం, శంకర్, యువకులు, మహిళలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తలసేమియా బాధిత చిన్నారులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :తలసేమియా బాధిత చిన్నారుల సంక్షేమంపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. నిజామాబాద్ జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తలసేమియా వార్డును మహేష్ గౌడ్ సోమవారం సందర్శించారు. వార్డులో చికిత్స పొందుతున్న తలసేమియా బాధిత చిన్నారుల తల్లిదండ్రులతో ఆప్యాయంగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి, ఎదుర్కొంటున్న సమస్యలు, చికిత్సకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ బుస్సా ఆంజనేయులును రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, రక్త సరఫరా, ఇతర సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల కోసం రెడ్‌క్రాస్ అందిస్తున్న సేవలను అభినందిస్తూ, జిల్లా రెడ్‌క్రాస్ బృందాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారికి అవసరమైన వైద్య సేవలు, రక్తం, ఇతర సదుపాయాల కల్పనలో ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. సమాజం లోని ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి తలసేమియా బాధిత చిన్నారులకు అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ మేయర్ ఉమారాణి, డీసీసీ అధ్యక్షులు నాగేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, ఆకుల లలిత, రాష్ట్ర గీత కార్మిక సంస్థ చైర్మన్ బాద్రి శేఖర్ గౌడ్, రెడ్ క్రాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.